తేదీ 11.04.2003, శ్రీరామనవమి, బృందావనం

# రామాయణంలో ఆదర్శమూర్తులు

ఎట్టి విద్యలు జగతిని ఎఱుగనట్టి
పక్షిజాతులు, పశువులు పరమమైన
నీమమును బూని జీవింప నేర్చియుండ
తెలివి గలిగిన నరునికీ తెలివి లేదే!

విశ్వమందు విభుడు వెలుగొందుచుండును
విభునియందు విశ్వము వెలుగుచుండు
విశ్వవిభుల మైత్రి విడదీయరానిది
సత్యమును తెల్పు మాట ఈ సాయిమాట

ప్రేమస్వరూపులారా! సాక్షాత్తు వేదమే దివి నుండి భువికి దిగి వచ్చినటువంటి రామాయణము. వేదములో ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణ వేదములని నాల్గు భాగములున్నవి. ఋగ్వేదము యజ్ఞయాగాది క్రతువులకు తోడ్పడునటువంటిది, పోషించునటువంటిది, కాపాడునటువంటిది. యజుర్వేదము యజ్ఞయాగాది క్రతువులకు సంబంధించిన మంత్రములతో కూడినది. కాబట్టి, రామాయణమునందు రాముడు ఋగ్వేదస్వరూపుడు, లక్ష్మణుడు యజుర్వేదస్వరూపుడు. రాముడు అరణ్యంలో ఉండినప్పుడు భరతుడు అయోధ్యను వదలిపెట్టి, నందిగ్రామంలో ఒక పర్ణశాలను నిర్మించుకొని నిరంతరం రామనామాన్ని గానము చేస్తూ వచ్చాడు. కనుక, అతడు సామవేద స్వరూపుడు. శత్రువులను సంహరించి మిత్రులను, పవిత్రమైన వ్యక్తులను కాపాడే నిమిత్తం జన్మించి నటువంటివాడు శత్రుఘ్నుడు. కాబట్టి, అతను

srisathyasaivachanamrutam

అథర్వణవేదస్వరూపుడు. వేదమే రామాయణము, రామాయణమే వేదము. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించడమే మానవధర్మము.

ప్రతి కుటుంబమునందు తల్లిదండ్రులకు, అన్నదమ్ములకు, అక్కచెల్లెళ్ళకు ఆదర్శమునందించి ఆనందమును చేకూర్చుచున్నది రామాయణము. రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు దశరథమహారాజుయొక్క పుత్రులు. అయితే, ఇంతమాత్రం తెలుసుకుంటే చాలదు; అంతరార్థాన్ని విచారణ చేయాలి. దశరథుడనగా ఎవరు? ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు – ఈ దశేంద్రియాలతోకూడిన దేహమే దశరథుడు. రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు సామాన్యమైన మానవుల వలె జన్మించినటువంటివారు కాదు. వీరు అగ్నినుండి ఆవిర్భవించిన చైతన్య స్వరూపులు. ఈ కలియుగంలో సోదరులు ఐకమత్యమును కోల్పోయి కలహాలను పెంచుకొని కష్టాలకు గురి అవుతున్నారు. కాని, ఆనాడు రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు ఏనాడూ కలహించినటువంటివారు కాదు. ఐకమత్యంగా, అన్యోన్యంగా సంచరిస్తూ అందరికీ ఆనందాన్ని, ఆదర్శాన్ని అందిస్తూ వచ్చారు.

బాల్యమునందు ఒకనాడు నల్గురు సోదరులూ కలిసి ఆడుకుంటున్న సమయంలో భరతుడు పరుగెత్తుకుంటూ వచ్చి కౌసల్య ఒడిలో కూర్చుని ఏడుస్తున్నాడు. "ఎందుకేడుస్తున్నావు నాయనా? ఆటలో ఓడిపోయావా?" అని ఆమె ప్రశ్నించగా భరతుడు, "అమ్మా! నేను ఓడిపోతే ఆనందించియుండేవాడిని. కాని, నేను ఓడిపోయే సమయంలో రాముడు ఉద్దేశపూర్వకంగా ఓడిపోయి నన్ను గెలిపించాడు. అన్నగారి ఓటమికి కారకుడనైనందుకు నాకు చాలా బాధగా ఉంది," అన్నాడు. ఈరీతిగా, బాల్యమునుండి రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు ఎంతో ప్రేమగా, ఐకమత్యంగా, అన్యోన్యంగా జీవిస్తూ వచ్చారు.

**'లక్ష్మణునివంటి సోదరుడు లభించడు'**

రాముడు తన సోదరులను ప్రాణసమానంగా ప్రేమిస్తూ వచ్చాడు. యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు, "వెతికితే ఈ జగత్తులో సీతవంటి భార్యయైనా నాకు లభ్యం కావచ్చు,

sri sathyasai vachanamrutam

కౌసల్యవంటి తల్లియైనా నాకు ప్రాప్తించవచ్చు. కాని, లక్ష్మణుని వంటి సోదరుడు చిక్కడు. లక్ష్మణుడు లేకుండా నేనుండీ ప్రయోజనమేమిటి?" అని తానెంతగానో పరితపించాడు.

భరతుడు తన మామగారి రాజ్యమునుండి అయోధ్యకు తిరిగి వచ్చేటప్పటికి రాముడు అరణ్యానికి వెళ్ళినాడని, ఇంక పదునాలుగేళ్ళవరకు తిరిగిరాడని తెలుసుకొని దిగ్భ్రాంతి చెందాడు. వెంటనే వసిష్ఠులవారివద్దకు వెళ్ళి నమస్కరించి, "గురుదేవా! రాముణ్ణి అరణ్యానికి పంపించినటువంటి ఈ రాజ్యము నాకెందుకు? జ్యేష్ఠపుత్రుడైన రాముడే ఈ రాజ్యానికి అధికారి. కాబట్టి, నేనిప్పుడే అరణ్యానికి వెళ్ళి, రాముని పాదములుపట్టి ప్రార్థించి, అయోధ్యకు తీసుకొనివచ్చి పట్టాభిషేకం చేస్తాను" అన్నాడు. ఈవిధంగా ఆ నల్గురు సోదరులూ ఒకరికోసం ఒకరు ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడేవారు.

**రాముడు తల్లిని సమాధానపరచడం**

రాముడు నారవస్త్రములు ధరించి అరణ్యానికి వెళ్ళడానికి సంసిద్ధుడై, తల్లికి చెప్పి వెళదామని ఆమె నివాసానికి వెళ్ళాడు. రాముడు చక్కగా అలంకరించుకొని పట్టాభిషేకానికి సంసిద్ధుడై తన గృహానికి వస్తాడని ఆమె ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా ఎదురుచూస్తోంది. కాని, నారవస్త్రములు ధరించి వచ్చిన సీతారాములను చూసి నిశ్చేష్టురాలైంది. "నాయనా! పట్టాభిషేకమునకు ధరించ వలసిన వస్త్రములు ఇవియా?" అని ఆమె అడుగుతూ ఉండగానే రాముడు చిరునవ్వుతో, "అమ్మా! ఈనాడు నా తండ్రి నన్ను అరణ్యరాజ్యానికి రాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. అరణ్యంలో తపస్సు చేసుకుంటున్న ఋషులను, మునులను రాక్షసు లనేకవిధాలుగా హింసిస్తున్నారు. కాబట్టి, రాక్షససంహారం గావించి ఋషులను, మునులను కాపాడే నిమిత్తం నేను అరణ్యానికి వెళుతున్నాను. పితృవాక్యపరిపాలన నాకు ప్రధానం," అన్నాడు. అప్పుడు కౌసల్య, "నాయనా! నిజమే, నీవు పితృవాక్యపరిపాలన చేయవలసిందే! మరి నేను నీ మాతృమూర్తిని కదా! నీ తండ్రియొక్క అర్ధాంగినైన నా ఆజ్ఞనుకూడా నీవు శిరసావహించ వలసిందే! ఎన్నో నోముల ఫలితంగా నీవు నాకు జన్మించావు. నిన్ను విడిచి నేను క్షణమైనా జీవించలేను. కాబట్టి, నీతోపాటు నన్నుకూడా అరణ్యానికి తీసుకొని వెళ్ళు," అని కోరింది. అప్పుడు రాముడు, "అమ్మా!

sri sathyasai vahamrutam

వృద్ధుడైన నీ పతి దుఃఖములో మునిగియుండగా ఆయనను వదలిపెట్టి నీవు అరణ్యానికి రావడం న్యాయం కాదు. ఆయన నా వియోగాగ్నిలో దగ్ధమౌతున్నాడు. ఇలాంటి సమయంలో నీవు ఆయనను ఓదార్చి ప్రేమతో, మృదుమధురమైన మాటలతో ఆయన హృదయ తాపాన్ని చల్లార్చాలి. అది నీ కర్తవ్యం. సతికి పతియే గతి కదా!” అన్నాడు.

రాముడీరీతిగా తన తల్లికి హితబోధ చేయడాన్ని సీత చక్కగా గమనించింది. వెంటనే ఆమె రామునివైపు చూసి, “నాథా! సతికి పతియే దైవమని, పతిని సేవించడమే సతియొక్క ధర్మమని నీ తల్లికి బోధిస్తున్నావు. నాకు మాత్రం అయోధ్యలోనే ఉండి అత్తమామలను చూసుకొమ్మని చెబుతున్నావు. మరి నా పతి నాకు దైవము కాదా? నా పతికి సేవ చేయడం నా కర్తవ్యం కాదా? ధర్మము స్త్రీలందరికీ ఒక్కటే కదా! నీ తల్లికొక ధర్మము, నాకొక ధర్మము ఉంటుందా?” అని ప్రశ్నించింది. అప్పుడు కౌసల్య రామునితో, “నాయనా! ధర్మము అందరికీ ఒక్కటే. నా కర్మను నేననుభవించక తప్పదు. కాని, సీతను మాత్రం నీవు బాధ పెట్టవద్దు. ఆమె ప్రార్థనను మన్నించి నీవెంట తీసుకొని వెళ్ళు. సర్వమును త్యజించి ఆమె నీతో అరణ్యానికి వస్తోంది. కాబట్టి, ఆమె మనస్సును నొప్పించవద్దు. ఆమెను సంరక్షించడం నీ కర్తవ్యం” అని చెప్పింది. దీనిని బట్టి కౌసల్య వ్యక్తిత్వం ఎంత గొప్పదో, ఆమె హృదయం ఎంత విశాలమైనదో మీరు అర్థం చేసుకోవచ్చు.

**సర్వ జీవులూ రామస్వరూపులే!**

తల్లీబిడ్డలయొక్క సంబంధము, అన్నదమ్ముల యొక్క సంబంధము ఎంత అన్యోన్యంగా, ఎంత పవిత్రంగా, ఎంత ఆదర్శవంతంగా ఉండాలో రామాయణం నిరూపిస్తోంది. రామాయణములోని ఆదర్శాలను గుర్తుకు తెచ్చుకునే నిమిత్తమే ఈనాడు మనం రాముని జన్మదినోత్సవమును జరుపుకుంటున్నాము. “రామో విగ్రహవాన్ ధర్మః”, అన్నారు. రాముడు ధర్మస్వరూపుడు. అంతేకాదు. వసిష్ఠుల వారు రాముని అందచందములను వర్ణిస్తూ, “పుంసాం మోహనరూపాయ” అన్నారు. “రామచంద్రా! నీవు సచ్చిదానందస్వరూపుడవు. నీ స్వరూపము పురుషులనుకూడా మోహింపజేసేదిగా ఉన్నది. నీ అందచందములు కేవలం బాహ్యశరీరానికి సంబంధించినవి కావు. నీలో ఉన్న

srisathyasaivachanamrutam

అనంతమైన, అపూర్వమైన ప్రేమ, కరుణలే నీ స్వరూపాన్ని ఇంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దినవి” అని కీర్తించారు. ఇట్టి పవిత్రమైన రామతత్త్వమును పాటగా పాడుకోవడం మరియు చరిత్రగా చెప్పుకోవడం నిజంగా మీ అదృష్టం. రాముడంటే కేవలం దశరథ తనయుడని భావించరాదు. రాముని కొక ప్రత్యేకమైన రూపం లేదు. సర్వజీవులూ రామస్వరూపులే! రమింపజేసేవాడే రాముడు. కాబట్టి, మీలో ప్రతి ఒక్కరూ రమింపజేసేవారుగా రూపొందాలి. ‘ఈశ్వరస్సర్వభూతానాం’, ‘ఈశావాస్య మిదం జగత్’, ఈ జగత్తంతా భగవత్స్వరూపమే! అందరూ ఈశ్వరస్వరూపులే! అందరూ రామస్వరూపులే! అందరూ దైవస్వరూపులే! కనుకనే, ‘రామ, కృష్ణ, గోవింద, లక్ష్మణ...’ మొదలైన పేర్లు పెట్టుకుంటున్నాము.

**ఊర్మిళ త్యాగగుణం**

కేవలం రామలక్ష్మణభరతశత్రుఘ్నులేగాక వారి పత్నులు కూడా గొప్ప ఆదర్శాన్ని అందించారు. సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తిలు నల్గురూ గొప్ప గుణము కల్గినవారు; పరుల ఆనందమే తమ ఆనందముగా భావించేవారు. రాముడు అరణ్యానికి బయల్దేరినప్పుడు సీత, “స్వామీ! నీవు మానవోద్ధరణ నిమిత్తం అవతరించిన వాడవు. నేనుకూడా అందులో ఒక భాగమే కదా! నీవు సర్వసంగ పరిత్యాగివై అరణ్యానికి వెళుతున్నావు. కాబట్టి, నేను కూడా సర్వసంగ పరిత్యాగినై నీ వెంట వస్తున్నాను” అని పలికింది. తన సర్వాభరణములను విసర్జించి రామునివెంట బయలుదేరింది.

లక్ష్మణుని భార్య ఊర్మిళ చిత్రకళలో గొప్ప ప్రావీణ్యం కల్గినది. ఆమె తన గదిలో కూర్చుని శ్రీరామపట్టాభిషేక ఘట్టాన్ని రంగులతో చక్కగా చిత్రించు చుండగా లక్ష్మణుడు వచ్చి, ‘ఊర్మిళా!’ అని పిలిచాడు. ‘ఏమిటి స్వామీ!’ అంటూ ఆమె లేచి నిలబడింది. ఆమె లేచే సమయంలో అక్కడున్న పెయింటు పొరపాటున ఆమె గీసిన చిత్రముపై ఒలికిపోయింది. “అయ్యో, ఎంతో అందంగా గీసినటు వంటి చిత్రము పాడైపోయిందే!’ అని బాధపడింది. అప్పుడు లక్ష్మణుడు చెప్పాడు: “ఊర్మిళా! లోకకళ్యాణమును చేకూర్చే శ్రీరామ పట్టాభిషేకమును కైకేయి చెడగొట్టింది. నీవు గీసిన చిత్రమును నేను చెడగొట్టాను.

sri sathyasai vahini amrutam

దీనిగురించి నీవు బాధ పడనక్కర్లేదు. ఈ జగత్తులో సుఖ దుఃఖములు రెండూ సమానంగా ఉంటాయి. వాటిని మనం సమత్వంతో స్వీకరించాలి."

**కష్టసుఖములు రెండును కలసియుండు**
**వీని విడదీయ నెవ్వరి వశము కాదు**
**సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖంబటండ్రు**

ఆమెకు జరిగిన సంగతి వివరించి లక్ష్మణుడు తానుకూడా సీతారాములవెంట అరణ్యానికి వెళుతున్నానని, పధ్నాల్గు సంవత్సరాలవరకు తిరిగి రానని తెలియ జేశాడు. ఊర్మిళ గొప్ప త్యాగగుణము కల్గినది. తన భర్త తనను విడిచి వెళుతున్నాడని ఆమె విచారించలేదు. సీతారాములకు సేవ చేసే అవకాశం తన పతికి లభించినందుకు ఎంతో ఆనందించింది. అతని పాదాలకు నమస్కరించి ఆనందంగా వీడ్కోలు పలికింది.

**భగవంతుని సన్నిధియే పెన్నిధి**

లక్ష్మణుని తల్లి సుమిత్ర పేరుకు తగినట్లుగానే గొప్ప గుణవంతురాలు. సీతారాములకు సేవచేసే నిమిత్తం తానుకూడా అరణ్యానికి వెళుతున్నానని లక్ష్మణుడు చెప్పినప్పుడు ఆమె ఆనందంగా తన అంగీకారాన్ని తెలియజేసింది. "నాయనా! నా కుమారులిరువురిలో ఒక్కరికైనా రాజయ్యే అవకాశం లేదే, అన్న విచారము నాకు లేదు. ఆరోజున ఒక గ్రద్ద వచ్చి నా పాయసపుగిన్నెను తన్నుకొని పోయినప్పుడు కౌసల్య తన పాయసంలో అర్ధభాగమును నాకిచ్చింది. కైకేయి కూడా తన పాయసమునుండి అర్ధభాగమునిచ్చింది. కౌసల్య పాయసమునుండి పుట్టినవాడవు నీవు. కైకేయి పాయసమునుండి పుట్టినవాడు శత్రుఘ్నుడు. కాబట్టి, నీవు రాముణ్ణి సేవించాలి; శత్రుఘ్నుడు భరతుణ్ణి సేవించాలి. ఇలాంటి సేవా భాగ్యము లభించడం నిజంగా మీ అదృష్టం" అంటూ ఎంతో ఆనందించింది. "భగవంతుడు ఎక్కడుంటాడో అక్కడే భక్తుడుంటాడు. భక్తుడు, భగవంతుడు ఎక్కడుంటారో అక్కడే విజయం చేకూరుతుంది. భగవంతుని సన్నిధియే నీ పెన్నిధి నాయనా! కనుక, తప్పక వెళ్ళిరా" అని లక్ష్మణుణ్ణి దీవించి పంపింది. కాని, కౌసల్య మాత్రం బాధపడుతూ, "నాయనా! సర్వసుఖాలతో కూడిన అయోధ్యలో మమ్మల్ని వదలిపెట్టి సమస్త కష్టములతో కూడిన

sri sathyasaivachanamrutam

అరణ్యానికి వెళుతున్నావా!" అన్నది. అప్పుడు లక్ష్మణుడు, "అమ్మా! సీతారాములు లేని ఈ అయోధ్యయే అరణ్యము. సీతారాములున్న అరణ్యమే యోధ్య. సీతారాములే నా తల్లిదండ్రులు. వారి సేవలు చేసుకుంటూ నేను ఆనందంగా ఉంటాను" అన్నాడు.

రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు - కౌసల్య, సుమిత్ర, కైకేయిలు మాత్రమేగాక సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తిలు కూడా ఎంతో అన్యోన్యంగా ఉంటూ ప్రతి కుటుంబానికి ఆదర్శమునందించారు. ఈరోజుల్లో ఏ కుటుంబములోనైనా తోటికోడళ్ళు ఐకమత్యంగా జీవిస్తున్నారా? అన్నదమ్ములెవరైనా పోట్లాడకుండా ఉంటున్నారా? ఈ కలియుగం కలహయుగంగా మారిపోయింది. ఇట్టి పరిస్థితిలో రామాయణం ప్రతి కుటుంబానికి గొప్ప ఆదర్శాన్ని అందిస్తోంది. మనం రామాయణాన్ని కేవలం చదివితే సరిపోదు. అందులో ఉన్న ఆదర్శాలను అందుకోవాలి. ఐకమత్యంతో జీవించాలి. అప్పుడే మన జీవితం సార్థకమౌతుంది. పశుపక్షిమృగాదులుకూడా ఎంతో ఐకమత్యంగా జీవిస్తున్నాయి. వాటికి దాచుకునే స్వార్థం, దోచుకునే దొంగబుద్ధి లేవు. పశుపక్షిమృగాదులలో కూడా లేని దుర్గుణాలు ఈనాటి మానవునిలో చోటుచేసుకున్నాయి.

దశరథుని కుటుంబములో ఒకరితోనొకరు పోట్లాడుకున్న సందర్భమే లేదు. అయితే, ఇక్కడ మీకొక సందేహం కల్గవచ్చు, "కైక చేసిన పనేమిటి? ఆమె పోట్లాడడంవల్లనే కదా రాముడు అరణ్యానికి వెళ్ళవలసివచ్చింది," అని మీరడుగ వచ్చు. అది పోట్లాట కాదు. అసలు కైకకు రాముడంటే చాలా ప్రీతి. తన కుమారుడైన భరతునికంటే రాముణ్ణి ఎంతో ప్రేమగా పెంచింది. కాని, సహవాస దోషమువలన ఆమె మనస్సులో మార్పు వచ్చింది. Tell me your company, I shall tell you what you are. మీ స్నేహితులను బట్టి మీరెలాంటివారో చెప్పవచ్చును. మంథరయొక్క ప్రోద్బలముచేతనే కైకేయి అలాంటి కోరికలు కోరింది. ఐతే, మంథరకు కూడా చెడ్డస్వభావం లేదు. ఆమెది కూడా మంచిస్వభావమే! ఆమె ఆవిధంగా ప్రవర్తించడానికి ఒక కారణమున్నది.

**మంథర పూర్వజన్మ వృత్తాంతం**

ఒక పర్యాయం కైకేయి తండ్రియైన కేకయరాజు అరణ్యంలో వేటాడుతూ ఉండగా

sri sathyasai vahini amrutam

ఒకచోట అతనికి ఆడ, మగ జింకలు రెండు ఆడుకుంటూ కనిపించాయి. అతను విడిచిన బాణం తగిలి మగజింక మరణించింది. ఆడ జింక ఏడుస్తూ తన తల్లివద్దకు పోయి, "అమ్మా! మేమిద్దరం కలిసి ఆనందంగా ఆడుకుంటున్న సమయంలో కేకయరాజు నా పతిని హతమార్చాడు. ఇప్పుడు నా గతేమిటి?" అన్నది. అప్పుడా తల్లి జింక, "అమ్మా! లోకంలో కష్టసుఖాలు రెండూ కలిసి ఉంటాయి. మనం కష్టనష్టాలకు క్రుంగిపోకూడదు. వాటిని తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగిపోవాలి" అంటూ తన బిడ్డను ఓదార్చింది. తరువాత తాను కేకయరాజువద్దకు వెళ్ళి, "రాజా! ఎవరైనా సరే, కర్మఫలమును అనుభవించక తప్పదు. నేను చేసింది నాకు తప్పదు, నీవు చేసింది నీకు తప్పదు. కనుక, ఇప్పుడు నా అల్లుని మరణంతో నేను బాధపడుతున్నట్లుగా మున్ముందు నీవుకూడా నీ అల్లుని మరణంతో బాధపడవలసివస్తుంది," అని శపించింది. ఆ జింకయే మంథరగా జన్మించి కేకయరాజు అల్లుడైన దశరథుని మరణానికి కారకురాలైంది.

**ప్రవృత్తి - నివృత్తి**

మానవజీవితము సంయోగ, వియోగాత్మకమైన మహోత్తుంగ తరంగములతో కూడిన సాగరము వంటిది. కాబట్టి, ఎవరికైనా కష్టనష్టములు తప్పవు. ఇది ప్రవృత్తి ధర్మము. కాని, నివృత్తి ధర్మము వేరే ఉంటున్నది. 'అమ్మా, నాకు ఆకలవుతున్నది' అని పిల్లవాడన్నప్పుడు, 'నాయనా! అన్నము భుజించు, ఆకలి తీరుతుంది' అని చెబుతుంది ప్రవృత్తి తల్లి. కాని, నివృత్తి తల్లి ఆవిధంగా చెప్పదు. 'నాయనా! నీకు ఆకలైతే అన్నము భుజించు. అయితే, ఎట్టి ఆహారమును, ఎప్పుడు, ఎక్కడ, ఏవిధంగా భుజించాలి, అని చక్కగా విచారణ చేసి హితమైన, మితమైన ఆహారమును భుజించు' అని హితవు చెబుతుంది. ఆకలౌతోందని చేతికి చిక్కినవన్నీ తింటే కడుపు పాడైపోతుంది. ఆరోగ్యానికి హాని కలిగించని ఆహారాన్ని మనం భుజించాలి. ఇది నివృత్తి ధర్మము. ప్రవృత్తీ నివృత్తుల తత్త్వమును వేదము కూడా చక్కగా బోధించింది.

మనకు అవసరమైనవాటికోసం ఆశపడడంలో తప్పు లేదు. కాని, ఆశకు ఒక పరిమితి ఉండాలి. పరిమితితో పాటు ప్రమాణమును అనుసరించాలి. నోటికి వచ్చినట్లుగా

srisathyasaivachanamrutam

మాట్లాడకూడదు. చేతికి చిక్కినదంతా భుజించకూడదు. మనస్సుకు తోచినదంతా చెప్పకూడదు. ఏవిషయము ఎప్పుడు చెప్పాలి, ఎవరికి చెప్పాలి, ఏవిధంగా చెప్పాలి, అని ముందు చక్కగా విచారణ చేయాలి. మీరు చెప్పే విషయాలు ఇతరులను నొప్పించేవిగా ఉండకూడదు. ఇలాంటి ఆదర్శాలు రామాయణంలో అనేకం ఉన్నాయి. కనుకనే, రామాయణము వేదస్వరూపంగా వర్ణింపబడింది. రామాయణము బోధించే ప్రవృత్తీ, నివృత్తుల తత్త్వాన్ని మనం చక్కగా పాటించాలి. ప్రవృత్తి – ప్రకృతియొక్క స్వభావము. నివృత్తి – ఆత్మయొక్క స్వరూపము. ప్రవృత్తి సంకుచితత్వాన్ని బోధిస్తుంది. నివృత్తి హృదయాన్ని విశాలం గావిస్తుంది. కాబట్టి, నివృత్తినే మనం ప్రధానంగా తీసుకోవాలి. రామాయణము నిన్నటిదో మొన్నటిదో కాదు; ఎన్నో వేల ఏళ్ళకు పూర్వం జరిగినటువంటిది. ఇంతటి సనాతనమైన రామాయణతత్త్వాన్ని ఈనాటికీ మనం గౌరవిస్తున్నామంటే, ప్రేమిస్తున్నామంటే, ఆరాధిస్తున్నామంటే దీనిలో ఎంత గొప్పతనం ఇమిడియున్నదో మీరు గుర్తించవచ్చు. రామాయణములో లేని నీతి మరెక్కడా కానరాదు. రామాయణమే మనకు ప్రధానమైన పారాయణము. రాముని జన్మదినోత్సవము పేరిట మనం పాయసపరమాన్నాలు వండుకొని భుజిస్తే సరిపోదు. రామతత్త్వాన్ని హృదయమునందు ప్రతిష్ఠించుకొని, అందరికీ ఆనందాన్ని అందించాలి. రామాయణంలో ఉన్న నీతిని అనుసరిస్తూ మన జీవితాన్ని ఉద్ధరించుకోవాలి. ఈ ప్రపంచంలో పర్వతములు, నదులు ఉన్నంతకాలం రామాయణము ఉంటుం దన్నాడు వాల్మీకి మహర్షి. పర్వతాలు, నదులకు మరియు రామాయణానికి మధ్య ఉన్న సంబంధ మేమిటి? అని మీకు సందేహము కల్గవచ్చు. నదులనగా స్త్రీలు, పర్వతములనగా పురుషులు. నదులు నిరంతరం ప్రవహిస్తూ పరులకు ఉపకారం చేస్తూ ఉంటాయి. స్త్రీలుకూడా అలాంటి త్యాగనిరతి కల్గినవారు. ఈ లోకంలో స్త్రీ, పురుషులున్నంతవరకు రామాయణముయొక్క కీర్తి చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.

ప్రేమస్వరూపులారా! రామచరిత్ర పవిత్రమైనది, విచిత్రమైనది, ఆనందకర మైనది. ఇది ఏనాటిదో అని భావించకూడదు. ఎప్పటికప్పుడు ఇది నూతనమైనదే! ఎప్పటికీ ఇది కల్యాణకరమైనదే! ఇట్టి పవిత్రమైన చరిత్రను మీరు మనస్సులో స్మరించుకుంటూ

భేదమును, ద్వేషమును విడనాడి అందరూ అన్యోన్యంగా జీవించాలని నేను ఆశిస్తున్నాను. నిరంతరము రామచింతన చేస్తూ ఉంటే సర్వులకూ ఆనందము లభిస్తుంది.

**(తేదీ 11.04.2003, శ్రీరామనవమి, బృందావనం)**

sri sathyasai vachanamrutam